క్లుప్తంగా

అయ్యప్ప దీక్షాపరులకు పండ్లు పంపిణీ



అయ్యప్ప దీక్షాపరులకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే 'పాల్వాయి'

కాగజ్‌నగర్‌టౌన్: శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములకు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు వీడ్కోలు పలికారు. ఆదివారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో కొచువెలి ఎక్స్‌ప్రెస్ రైలులో శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప దీక్షాపరులకు పండ్లు పంపిణీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే కోనప్ప పరామర్శ



పరామర్శిస్తున్న కోనప్ప

కౌటాల: మండల వైస్‌ఎంపీపీ నికాడే అమ్మక్క తల్లి ఇటీవల మృతి చెందడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప ఆదివారం మండలంలోని గురుడుపేట్ గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ నికాడే గంగారం, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, నాయకులు బ్రహ్మయ్య, సదాశివ్, వెంకటేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన 'కొత్తపల్లి'



కిషన్‌రెడ్డితో 'కొత్తపల్లి' దంపతులు

కౌటాల: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర డైరీని అందించారు.

అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు



ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అయ్యప్ప మాలధారణ స్వాములు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

షిర్డీ సాయిబాబా పల్లకిసేవలో భక్తులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన షిర్డీ సాయిబాబా భక్తులు ఆదివారం పల్లకి సేవలో తరించారు. ప్రత్యేక వాహనాల్లో దాదాపు 300మంది భక్తులు షిర్డీ వెళ్లారు. భక్తి పారవశ్యంతో పాటలు పాడుతూ, భాజభజంత్రీలతో పల్కినివార్ నుంచి కండోబా ఆలయం మీదుగా పల్లకితో షిర్డీ సాయిబాబా దేవాలయానికి చేరుకున్నారు. ఏటా మాదిరిగానే ఈ సారి కూడా పల్లకి సేవకు వెళ్లినట్లు భక్తులు తెలిపారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి షిర్డీ సాయిబాబా ఆలయ చైర్మన్ ఆవునూరి దుర్గయ్య, కమిటీ సభ్యులు కుప్పుస్వామి, కుంబాల రాజేష్, దత్తు, శ్రీనివాసాచారి, అన్వేష్, చరణ్, సాయీశ్వర్, అజయ్, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

రామకృష్ణాపూర్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్థానిక సీనియర్ క్రీడాకారులు, పీఈటీల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం నాలుగు మ్యాచ్‌లు నిర్వహించిన అనంతరం విజేతలకు పట్టణ ఎస్సై రాజశేఖర్ బహుమతులు అందించారు.

'ఆర్టీసీ' సేవలకు దూరం!

- కరోనా నేపథ్యంలో 2019లో రద్దయిన బస్సు
- ఇబ్బందుల్లో 12 గ్రామాల ప్రజలు
- కెరమెరి –జోడేఘాట్‌కు బస్సు ప్రారంభించాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు



పాటగూడ నుంచి కాలిబాటతో కెరమెరికి వస్తున్న మహిళలు

కెరమెరి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించింది. దీంతో బస్సులకు బాగా డిమాండ్ పెరిగింది. అయితే మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల మహిళలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా నేపథ్యంలో 2019లో మండల కేంద్రం నుంచి జోడేఘాట్‌కు బస్సు రద్దు చేశారు. గతంలో ప్రతీరోజు ఉదయం, సాయంకాలం రెండు ట్రిప్పులు బస్సులు తిరిగేవి. కానీ అధికారులు బస్సు పునరుద్ధరణ చేయకపోవడంతో ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి జోడేఘాట్ వరకు మొత్తం 12 గ్రామాలు ఉండగా, 1634కు పైగా జనాభా ఉంది. అందులో 900 మంది మహిళలు ఉన్నారు. ఆర్టీసీ అధికారులు బస్సు వేస్తే ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, తద్వారా చార్జీల తిప్పలు తప్పుతాయని మహిళలు పేర్కొంటున్నారు.

అధిక చార్జీలు వసూలు..

జోడేఘాట్ నుంచి కెరమెరి వరకు కేవలం 21 కిలోమీటర్ల దూరం ఉంది. కాని ప్రైవేటు వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో వ్యక్తికి రాను, పోను రూ.100 చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. కెరమెరి నుంచి టోకెన్ మోవాడ్ వరకు కొంత వరకు రోడ్డు బాగా లేకపోయినా, టోకేన్‌మోవాడ్ నుంచి జోడేఘాట్ వరకు తారురోడ్డు ఉంది. జోడేఘాట్ చేరుకోవడానికి కేవలం 40 నిమిషాల సమయం పడుతుంది. అయినా ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికులు లేకుంటే రూ.200 వరకు కూడా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే బస్సుకు అయితే కేవలం రూ.28 చార్జీ తీసుకునే వారని మండలవాసులు పేర్కొంటున్నారు. కానీ ప్రస్తుతం బస్సులు నడపకపోవడంతో అధిక చార్జీలు చెల్లించి ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తుందని వాపోతున్నారు. రద్దీగా ఉండే ఈ మార్గంలో బస్సులు నడిపించకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జీపు టాప్‌పై ప్రయాణిస్తున్న జోడేఘాట్ వాసులు



ప్రైవేటు వాహనం కోసం నిరీక్షిస్తున్న మహిళలు

రూ.150 తీసుకున్నారు..



పాటాగూడ క్రాస్‌రోడ్డు నుంచి కెరమెరికి 8 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ నాకు ఓపిక లేక ప్రైవేట్ వాహనాన్ని ఆశ్రయిస్తే రూ. రూ.150 తీసుకున్నాడు. అదే బస్సు ఉంటే ఉచితంగా కెరమెరికి చేరేదాన్ని.

– కోట్నాక రాంబాయి, చాల్‌బాడి

బస్సు నడపాలి..



ఐదేళ్ల నుంచి మా గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రైవేటు వాహనాల్లో అధిక చార్జీలు వెచ్చించి ప్రయాణాలు చేస్తున్నాం. చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మా గ్రామానికి బస్సు వేయాలి.

– కొండ రుక్మాబాయి, బాబేఝరి

మండల స్వేరో కమిటీ ఎన్నిక



స్వేరో నూతన కార్యవర్గం

కౌటాల: మండల కేంద్రంలో ఆదివారం మండల స్వేరో నూతన కమిటీని కాళేశ్వరం జోన్ స్వేరో నాయకులు కొండా రాంప్రసాద్, డొంగ్రే సురేశ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా ఎస్.గణపతి, ఉపాధ్యక్షులుగా రాంటెంకి శ్రీవాణి, లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కామ్రె శంకరయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అంజన్న, దశరథ్, సునీల్, కోశాధికారిగా శ్రీకాంత్, కార్యదర్శులుగా నేతాజీ, నరేశ్, రోషన్, మావిణ, రంగయ్య, స్పోకెన్ పర్సన్‌గా సెల్వటీకార్ నవీన్, సోషల్ మీడియా రాజు, ఉమేశ్, ప్రశాంత్, సభ్యులుగా సిద్దార్థ, దీపక్, సుధాకర్, మహేందర్, శ్రీకాంత్, అఖిల్‌ను ఎన్నుకున్నారు.

పీటీజీలకు కార్డులు పంపిణీ



కొలాంఝరిలో పంపిణీ చేస్తున్న శ్యాంరావు

కెరమెరి: మండలంలోని 21 ఆదిమ గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలకు ఆదివారం అభివృద్ధి కార్డులు పంపిణీ చేసినట్లు ఎస్సీఆర్‌పీలు చహకటి శ్యాంరావు, నరేశ్ తెలిపారు. కొలాంగూడ, టిమ్మగూడ, బోరిలాల్‌గూడ, లైన్‌పటార్, చిన్నపాట్నాపూర్, పెద్ద పాట్నాపూర్, జోడేఘాట్, బాబేఝరి, కల్లెగాం, కొత్తగూడ, నాగల్‌గొంధి, కొలాంఝరి, టోకెన్‌మోవాడ్ గ్రామాల్లో 'పీఎం జన్‌మన్' కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా త్వరలో ఆయా గ్రామాల్లో గృహాలు, పాఠశాలలు, మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. కార్యక్రమంలో రామారావు, గోకుల్, తానాజీ, కర్ను, నారాయణ, గుణవంత్‌రావు, రాంజీ తదితరులు ఉన్నారు.

పత్తికి మద్దతు ధర పెంచాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

ఆసిఫాబాద్: పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.10 వేలు చెల్లించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉప్పరి ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పత్తికి మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గత సంవత్సరం ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ. 10వేలు చెల్లించగా, ఈ ఏడాది సీసీఐ రూ. 6500 నుంచి రూ. 7000 వరకు చెల్లిస్తుందన్నారు. తేమ శాతం పేరుతో సీసీఐ అధికారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ఎరువులు, పురుగుల మందుల ధరలతో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పత్తికి మద్దతు ధర పెంచాలన్నారు. రైతు సంఘం నాయకులు నంది తిరుపతి, వెంకటేశం, లస్మయ్య పాల్గొన్నారు.

గంజాయి నుంచి యువతను కాపాడాలి



మాట్లాడుతున్న గొడిసెల కార్తీక్

ఆసిఫాబాద్: గంజాయి మహమ్మారి నుంచి యువతను కాపాడాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గేడం టీకానంద్, గొడిసెల కార్తీక్ కోరారు. జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకూ గంజాయి వినియోగం పెరిగిపోతుందన్నారు. స్మగ్లర్లు ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేసి డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారని, విచ్చలవిడిగా రాత్రి సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కోశాధికారి రాజ్‌కుమార్, పురుషోత్తం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న జీపీల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల: చిన్న గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని శీర్షా గ్రామంలో బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గొల్లకుర్మలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందరర్‌గౌడ్, నాయకులు మిథున్, భీమన్న, బండురావు, శంకర్, తిరుపతి, చందు, మధుకర్, పర్వతాలు, వసంత్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు



కెరమెరి: కేక్ కొనుగోలు చేస్తున్న యువకులు



ఆసిఫాబాద్‌రూరల్: కొనుగోలు చేస్తున్న యువకులు



ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో..

కెరమెరి: 2023కు బైబై చెబుతూ.. 2024ను స్వాగతిస్తూ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం నూతన సంవత్సరం వేడుకలను జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కేక్ కట్ చేశారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు పెడుతూ.. టపాకాయలు పేల్చారు. కేక్ దుకాణాలు, స్వీట్‌హౌస్‌ల వద్ద ఆదివారం సందడి కనిపించింది.

ఆసిఫాబాద్‌రూరల్: న్యూయర్ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బేకరీలు కేకుల అమ్మకాలతో సందడిగా మారాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్, అంబేద్కర్, గాంధీ చౌక్‌లలో పెద్ద ఎత్తున యువకులు కేకులు కొనుగోలు చేశారు.

రోడ్డు టెర్రర్!

- మండలంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులు
- ప్రమాదకరంగా రహదారులు



అదెపెల్లి -కదంబా మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

చింతలమానెపల్లి: మండలంలోని రహదారులపై సంభవిస్తున్న వరుస ప్రమాదాలు ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నాయి. వాహనదారులు నిబంధనలు పాటించాలని అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రహదారులపై తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు సైతం విధిస్తున్నారు. అయినా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

పెరిగిన రద్దీ..

చింతలమానెపల్లి మండలంగా ఏర్పడిన అనంతరం మండలంలో రద్దీ పెరిగింది. మండలం నుంచి డబ్బా మీదుగా కాగజ్‌నగర్, గూడెం మీదుగా మహారాష్ట్రకు రహదారులు ఉన్నాయి. కౌటాల నుంచి బెజ్జూర్ మండలానికి మండల కేంద్రం మీదుగా రహదారి ఉంది. మండలంలోని డబ్బా, అడెపల్లి మీదుగా కౌటాల, బెజ్జూర్ మండలాల ప్రజలు కాగజ్‌నగర్‌కు వెళ్తుంటారు. వ్యాపార, బంధుత్వ సంబంధాల అవసరాల కోసం ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. మహారాష్ట్రకు రవాణా పెరిగిన నేపథ్యంలో మండలంలో వాహనాల రద్దీ పెరిగింది.

నిబంధనల ఉల్లంఘన..

అధికారులు వాహనాలకు జరిమానాలు విధిస్తున్నా వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. పంటలు చేతికొచ్చే సమయంలో వ్యవసాయ కూలీలను నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లలో, ట్రాలీలలో తరలిస్తున్నారు. పరిమితికి మించి నిర్లక్ష్యంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగే మార్గాలను అధికారులు గుర్తించి ఆయా మార్గాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా రహదారులు..

మండలంలోని డబ్బా మీదుగా కాగజ్‌నగర్‌కు వెళ్లే రహదారి అటవీ ప్రాంతం గుండా వెళ్తోంది. కాగా ఈ మార్గంలో మలుపులు ఎక్కువగా ఉండడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరిగాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు మండలంలోని ఖర్జెల్లి మీదుగా మహారాష్ట్రలోని అహేరికి వెళ్లే రహదారి సైతం ప్రమాదకరంగా ఉంది.

తరచూ ప్రమాదాలు..

మండలంలోని మార్గాల్లో ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. గత రెండు నెలల సమయంలో మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మైనర్లు మృతి చెందగా మరి కొందరు క్షతగాత్రులయ్యారు.

ఇటీవల చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు..

- నవంబర్ 24, 2023న మండలంలోని డబ్బా నుంచి కాగజ్‌నగర్ మార్గంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు సీఆర్‌టీ ఉపాధ్యాయులు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యారు.
- డిసెంబర్ 8న కదంబా నుంచి కాగజ్‌నగర్ మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు బెజ్జూర్ మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా ముగ్గురు గాయాలపాలయ్యారు.
- డిసెంబర్ 18న మండలంలోని డబ్బా –అడెపల్లి గ్రామాల మధ్యన జరిగిన ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సైఫ్ అలిఖాన్ అనే బాలుడు ఆటో ట్రాలీ ఢీకొట్టడంతో తలకు గాయాలై మృతి చెందాడు.
- డిసెంబర్ 20న మండలంలోని బాలాజీ అనుకోడకు చెందిన మైనర్ బాలిక దుర్గం అఖిల పత్తి ఏరడానికి ఆటో ట్రాలీలో వెనక కూర్చొని ప్రయాణిస్తుండగా రవీంద్రనగర్ –గంగాపూర్ గ్రామాల మార్గంలో ఆటో ట్రాలీ నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందింది.

కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తున్నాం. వాహనదారులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. వాహనాలపై ప్రయాణించేవారు స్వీయ రక్షణ పాటించాలి.

– సాధిక్ పాషా, సీఐ, కౌటాల

భక్తిశ్రద్ధలతో బోనాలు





కాగజ్‌నగర్‌రూరల్: సట్టి బోనాల సందర్భంగా మండలంలోని ఈజ్‌గాం శివాలయంలో మూడో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శివ మల్లన్నకు పంచామృత అభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆలయానికి నూతన కమిటీని నియమించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



ఎస్టీ హోదాపై ఎమ్మెల్యేకు వినతి

కాగజ్‌నగర్‌టౌన్: మాలీలకు ఎస్టీ హోదా కల్పించే విధంగా కృషి చేయాలని మాలీ సంఘం నాయకులు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబను కోరారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తమ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గుర్నూలే నారాయణ, ఆదే బసంత్ రావు, మాలీ సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.

లౌడ్‌స్పీకర్ అందజేత

వేమనపల్లి: మండలంలోని ముల్కలపేట ఎంపీయూపీఎస్ పాఠశాల అవసరాల నిమిత్తం జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఆదివారం లౌడ్‌స్పీకర్ అందజేశారు.